అగ్ని ప్రమాద బాధితులకు టీడీపీ నాయకుల ఆర్థిక సాయం

విశాలాంధ్ర-ఆనందపురం : ఆనందపురం మండలం గిడిజాల గ్రామంలో మంగళవారం ఉదయం జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో జరిగిన అగ్ని ప్రమాదంలో 3 పూరీళ్ళు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి . సమాచారం తెలిసిన వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న మాజీ సర్పంచ్ కోరాడ రాము, టిడిపి యువ నాయకులు కోరాడ వైకుంఠం కుటుంబానికి సహాయం నిమిత్తం 10 వేల రూపాయలు నగదు తో పాటు, నిత్యావసర వస్తువులు ఆహార పదార్థాలు, కుటుంబానికి అందించి, మేమున్నామంటూ వాళ్ళకి భరోసా కల్పించి అన్ని విధాల ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామపంచాయతీ నాయకులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి

సిపిఐ కార్యదర్శి కాండ్రేగుల సత్యాంజనేయ డిమాండ్

విశాలాంధ్ర-మల్కాపురం : పశ్చిమ నియోజకవర్గ పరిధిలో పేదవాడికి సొంత ఇంటి కలగానే మిగిలిపోకూడదని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని పశ్చిమ నియోజక వర్గ సిపిఐ కార్యదర్శి కాండ్రేగుల సత్యాంజనేయ పేర్కొన్నారు. మంగళవారం 59 వ వార్డు ములగాడ పరిధిలోని గల తహసీల్దార్ కార్యాలయం వద్ద పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించి మాట్లాడితే పేదలకు ఇళ్ల స్థలాలు పట్టాలు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని ములగాడ తాసిల్దార్ కార్యాలయం లో తహసిల్దార్ అందుబాటులో లేకపోవడం వలన కార్యాలయంలో ఉన్న సిబ్బందికి వినతి పత్రం అందజేసినాము పట్టణాల్లో రెండు సెంట్లు పల్లెలో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు జీవో నెంబర్ 30 ప్రకారం ఇళ్ల పట్టాలు అర్హులైన వారందరికీ వెంటనే ఇవ్వాలని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటిన టిట్కో ఇల్లులు అర్హులైన లబ్ధిదారులకు ఇంకా ఇవ్వకపోవడం సిగ్గుచేటు అర్హులుగా గుర్తించిన లబ్ధిదారులకు ఇల్లు అద్దెలు కట్టలేక చాలా ఇబ్బందులు పడుతున్నారు టిట్కో ఇల్లులు లబ్ధిదారులకు సాంక్షన్ అయ్యిందని చెప్పి కాగితాలు ఇచ్చి లబ్ధిదారులకు ఇల్లు ఇవ్వకపోవడం దుర్మార్గం అని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు తక్షణమే ఇళ్ల స్థలాలు ఇళ్ల పట్టాలు టిట్కో ఇల్లులు వెంటనే ఇవ్వాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కోటమీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుంది పశ్చిమ నియోజకవర్గం సహాయ కార్యదర్శి గుడాల రాంబాబు మరియు విశాఖ జిల్లా సమితి సభ్యులు గండి అప్పారావు గుడాల జయ మరియు తిలక అప్పల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ నగర డిప్యూటీ మేయరుగా దల్లి గోవిందరాజు

విశాఖ జాయింట్ కలెక్టర్, అదనపు మెజిస్ట్రేట్, ఎన్నికల ప్రెసైడింగ్ అధికారి మయూర్ అశోక్ వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్‌గా కార్పొరేటర్ దల్లి గోవిందరాజు ఎన్నికయ్యారని విశాఖ జాయింట్ కలెక్టర్, అదనపు మెజిస్ట్రేట్, ఎన్నికల ప్రెసైడింగ్ అధికారి మయూర్ అశోక్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ప్రకారం మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఎన్నిక మంగళవారం ఉదయం 11 గంటలకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి డిప్యూటీ మేయర్‌ను ఎన్నుకోవడం జరిగింది. ఈసందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్, ఎన్నికల ప్రెసైడింగ్ అధికారి మాట్లాడుతూ మే 19వ తేదీ డిప్యూటీ మేయర్ ఎన్నికకు ఎన్నికల నోటిఫికేషన్ ప్రకారం జివిఎంసి కౌన్సిల్ సమావేశ మందిరంలో సభ్యులు సమావేశం అయినప్పటికీ క్వారమ్ లేకపోవడం వలన డిప్యూటీ మేయర్ ఎన్నిక మే 20వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించేందుకు వాయిదా వేసామని తెలిపారు. 20వ తేదీన జరిగిన కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి డిప్యూటీ మేయర్‌ను ఎన్నుకోవడం జరిగిందన్నారు. జీవీఎంసీ డిప్యూటీ మేయర్‌గా దల్లి గోవిందరాజు ఎన్నికయ్యారని తెలిపారు. ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ప్రకారం జీవీఎంసీ మేయర్ ఎన్నికలకు సంబంధించి కూటమి అభ్యర్థిగా బి-ఫారమ్ టికెట్ 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరాజు సమర్పించారని, దల్లి గోవిందరాజును డిప్యూటీ మేయరు అభ్యర్థిగా విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు పి.జి.వి.ఆర్.నాయుడు (గణబాబు) ప్రతిపాదించగా, ఉత్తర నియోజకవర్గం శాసనసభ్యులు విష్ణు కుమార్‌రాజు బలపరిచారని, ఎక్స్ అఫీషియో సభ్యులు, కార్పొరేటర్లు మొత్తం 59 మంది హాజరు కాగా డిప్యూటీ మేయర్ ఎన్నికకు సరిపోయిన క్వారమ్ ఉన్నందున మరో అభ్యర్థి పోటీలో లేనందున డిప్యూటీ మేయర్‌గా దల్లి గోవిందరాజు ఎన్నికైనట్లు ఎన్నికల ప్రెసైడింగ్ అధికారి మయూర్ అశోక్ ప్రకటించారు. అనంతరం డిప్యూటీ మేయరుగా దల్లి గోవిందరాజుచే ఎన్నికల ప్రెసైడింగ్ అధికారి ప్రమాణా స్వీకారం చేయించారు. ఈసందర్భంగా కూటమి శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, కొణతాల రామక్రిష్ణ, వెలగపూడి రామకృష్ణబాబు, వంశీ క్రిష్ణ శ్రీనివాస్ యాదవ్, విష్ణుకుమార్ రాజు, పంచకర్ల రమేష్ బాబు, పి.గణబాబు, గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, కార్పొరేటర్లు, అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లు, అధికారులు, సిబ్బంది నూతన డిప్యూటీ మేయర్ కు పుష్ప గుచ్చాలు అందించి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

సద్దు మణిగిన కూటమి వివాదం...

గ్రేటర్ విశాఖ డిప్యూటీ మేయర్ గా దల్లి గోవింద్ రాజు ఎన్నికతో కూటమి పార్టీల మధ్య నెలకొన్న అగాధం సద్దు మనిగింది. తొలి రోజు కోరం లేక వాయిదా పడ్డ సమావేశం రెండో రోజు మంగళవారం ఉదయం 11 గంటలకే ఎమ్మెల్యేలు అంతా పరుగు పరుగున వచ్చారు. టిడిపి అధినేత చంద్రబాబు, యువనేత లోకేష్ జిల్లా టిడిపి నేతలకు గట్టిగా వార్నింగ్ ఇవ్వడంతోనే కార్పొరేటర్లు ఎమ్మెల్యేలు కలిసి వచ్చి జనసేన అభ్యర్థికి కేటాయించిన డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో విజయం సాధించారు. పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు డిప్యూటీ మేయర్ గా తల్లి గోవిందరాజు పేరును ప్రతిపాదించగా ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు సమర్థించారు. పెళ్లిరోజు హాజరుకాని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం డిప్యూటీ ఎన్నికకు హాజరయ్యారు.

పూడికతీత పనులను జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు పర్యవేక్షణ

విశాలాంధ్ర-తగరపువలస : జీవీఎంసీ జోన్-1 భీమిలి పరిధిలో వార్డు 1, 2లలో మంగళవారం ఉదయం పడిన వర్షం కారణంగా తగరపువలస ఏరియాలో ఉన్న సబ్బి వానిపేట, రామన్నపేట, బాలాజీనగర్, నగరపు వీధిలలో నీరు నిలిచిపోయే ప్రాంతాలను, ఔట్లెట్‌ను స్థానిక జోనల్ కమిషనర్ చూసి, అంబేద్కర్ కూడలి వద్ద కాలువ పూడిక తీత పనులను దగ్గర ఉండి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమీషనర్ అయ్యప్ప నాయుడు, శానిటరీ సూపర్వైజర్ బి.మహాలక్ష్మి నాయుడు, జోనల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కి అంతరాయం

విశాలాంధ్ర-అనందపురం : ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జోన్ 3 పోలాకి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అనందపురం సబ్‌స్టేషన్ 33/11 కెవి, బాకురుపాలెం, ఐటిబివి ఫీడర్ మెయింటినెన్స్ కొరకు అనందపురం మండలంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎల్విం పాలెం, సీతం పాలెం, జగ్గు రాజుపాలెం, పందలపాక, బాకురుపాలెం, ఇచ్ఛాపురం, గొంపవానిపాలెం, నిన్నయ్యపాలెం, రాము నాయుడుపేట, రేగానిగూడెం, ముకుందపురం కాలనీ, తదితర ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని మండల ఏఈ ఎం.అప్పలనాయుడు తెలిపారు.

ప్రపంచ రికార్డు సృష్టించేలా విశాఖలో అంతర్జాతీయ యోగా డే

- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సమీక్ష

విశాఖలో లక్షల మందితో కలసి ప్రధాని యోగాసనాలు
ఆర్‌కె బీచ్ నుంచి భీమిలి వరకు సముద్ర తీరం పొడవునా నిర్వహణ

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : ప్రపంచరికార్డు సృష్టించేలా 11వ అంతర్జాతీయ యోగా డేను తేదీ జూన్ 21న విశాఖ జిల్లాలో నిర్వహించేందుకు ప్రతిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. జూన్ 21వ తేదీన జరిగే యోగా డే కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పాల్గొననున్నందున, ఈ కార్యక్రమం చరిత్రలో నిలిచిపోయేలా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుందన్నారు. మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అంతర్జాతీయ యోగా డే కార్యక్రమ నిర్వహణపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 21 నుంచి జూన్ 21 వరకు "యోగా మంత్" పాటించాలని, ఈ నెల రోజులు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో యోగా ప్రాక్టీస్ జరగాలన్నారు. ""యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్ ను ఈ ఏడాది యోగా దినోత్సవ థీమ్‌గా ప్రభుత్వం తీసుకున్నదని, అందువల్ల జూన్ 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో యోగా అభ్యాసానికి ఇది నాంది పలకాలని, ప్రతి ఒక్కరినీ ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలన్నారు. 'యోగాంధ్ర-2025' థీమ్‌తో ప్రచారం చేపట్టి ప్రజలను సన్నద్ధం

చేసేందుకు నెలరోజుల పాటు ప్రజలకు యోగా పై శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో గ్రామ,వార్డు సచివాలయాల ద్వారా యోగా డేలో పాల్గొనే అంశంపై ప్రజల నుంచి రిజిస్ట్రేషన్లు తీసుకోవాలని, అదే విధంగా స్కూళ్లు, కాలేజీల విద్యార్థులను, డ్వాక్రా మహిళలను, ప్రైవేటు ప్రభుత్వ సంస్థల ఉద్యోగులను, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను, ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆర్ కె బీచ్‌లో దేశప్రధాని కార్యక్రమం, ప్రజల పాల్గొనే ప్రాంతాల నిర్వహణపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఆర్కె బీచ్ నుంచి భీమిలి బీచ్ వరకు అన్ని చోట్ల ప్రజలు యోగాసనాలు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్కే బీచ్ నుంచి పార్క్ హెూటల్ వరకు, అదే విధంగా పార్క్ హెూటల్ నుండి భీమిలి బీచ్ రోడ్ వరకు సుమారు 2.5 లక్షల మంది యోగాలో పాల్గొనేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఆర్కే బీచ్, రుషికొండ, స్కూల్స్, క్రికెట్, పోలీస్, స్పోర్ట్స్, నావీ ప్రాంగణాలతో పాటు పలు ఖాళీ ప్రదేశాలను యోగా నిర్వహణకు గుర్తించడం జరిగిందన్నారు.

యోగాలో ప్రపంచ రికార్డ్ నెలకొల్పాలి.... యోగా దినోత్సవాన్ని ప్రకటించి 10ఏళ్లు పూర్తియిన సందర్భంగా, ప్రధాని పాల్గొనే 11వ అంతర్జాతీయ యోగ డే కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించాలని సూచించారు. 2023లో సూరత్‌లో 1.53 లక్షల మందితో ఒకే చోట అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరిపి వరల్డ్ రికార్డ్‌ను సాధించింది. సూరత్ తరహాలో విశాఖలోనూ యోగా దినోత్సవాన్ని నిర్వహించి ఈసారి ఆ రికార్డును తిరగరాయాలని, అందుకు అధికారులు ప్రతిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో 2.50 లక్షల మందిని భాగస్వామ్యం చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్ల సమన్వయంతో ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు అక్కడ నుంచి విజయనగరం జిల్లా మీదుగా శ్రీకాకుళం వరకు సుమారు 5 లక్షల మందిని భాగస్వామ్యం చేస్తూ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించా లని అధికారులను ఆదేశించారు. యోగ శిక్షకుల ద్వారా శిక్షణలు ప్రారంభించాలని చెప్పారు. దీనిలో భాగంగా మాసోత్సవాలను నిర్వహించేందుకు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఈ నెల 21వ తేదీ ఉదయం 6.30 నుంచి 8.00 గంటల మధ్యలో విశాఖ ఆర్ కె బీచ్ రోడ్లో 1000 మందితో ప్రాథమిక వేడుకలను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మే21నుంచి మండల, గ్రామ స్థాయిల్లో అవగాహన కార్యక్రమాలు, శిక్షణలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో డిసిపి లు మేరీ ప్రశాంతి, అజిత, రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్ తో పాటు జిల్లా అధికారులు, యోగా టీచర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

జూనియర్ ఎన్టీఆర్ జన్మదినోత్సవం సందర్భంగా పళ్ళు, దుప్పట్లు పంపిణీ

విశాలంధ్ర-సింహచలం : గ్రేటర్ విశాఖ జూనియర్ ఎన్టీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని, బుదవారం గోపాలపట్నం నందమూరి ఫ్యాన్స్ ఆధ్వర్యంలో శ్రీనివసనగర్‌లో ఉన్న బంగారు తల్లి వృద్ధాశ్రమంలోనూ, మనసు అనాధ శరణాలయంలో పిల్లలకు, పళ్ళు దుప్పట్లు, పాలుప్యాకెట్లు, టవల్సు, పంచడం జరిగింది. అలాగే గోపాలపట్నం సౌజన్య థియేటర్ నందు మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరిగింది. గౌరవ అధ్యక్షులు అప్పారావు, ప్రెసిడెంట్, తిరుపతి శ్రీను,వైస్ ప్రెసిడెంట్ జనార్దన్ రెడ్డి, ఆర్గనైజర్స్, కిట్టు, ఆర్ టి ఎన్ సభ్యులు శంకర్, భాష, గోపి చరణ్, వాసు, చైతన్య, ఆదినారాయణ, రెడ్డి, మిగతా అభిమానులు పాల్గొనడం జరిగింది.

వేసవి శిక్షణా శిబిరంలో కళాకృతులు తయారీ

విశాలాంధ్ర-మల్కాపురం : స్థానిక మల్కాపురంలోని శాఖా గ్రంధాలయంలో బాలలకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో మంగళవారం కళాకృతులను తయారు చేశారు. జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అదికారి వై.అనసూయదేవి ఆధ్వర్యంలో బొమ్మలను, పువ్వులను, పర్సులను తయారు చేయడంలో బాలలకు శిక్షణ ఇచ్చారు. అంతా కలసి అనేక పర్సులను, పువ్వులను తయారు చేశారు. అనంతరం వాటిని గ్రంథాలయాధికారికి బహుమతిగా ఇచ్చారు. ఇటువంటి కళాకృతులలో శిక్షణ ఇవ్వడం వల్ల బాలలలో సృజనాత్మక శక్తి పెరుగుతుందని ఆమె అన్నారు. అంతకుముందు వివిధ రకాల కళాకృతుల తయారీ గురించి చర్చ జరిగింది. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్, గ్రంథాలయ పాఠకులు, బాలలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం చిన్నారులను ఎంతగానో అలరించింది.

1559వ రోజు రిలే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర-గాజువాక : విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐక్యపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం స్టీల్ ప్లాంట్ ముఖద్వారం వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1559వ రోజుకు చేరాయి. సమ్మె కారణంగా ఇక్కడ నిర్వహిస్తున్న రిలే దీక్షలో అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు హెరీరున కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పాల్గొన్నారు. సమ్మె కారణంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గాజువాక సౌత్ సబ్ డివిజన్ పోలీసులు భారీగా మోహరించారు. స్టీల్ ప్లాంట్ బి,సి గేటు, మెయిన్ గేటుల వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ యాజమాన్య వైఖరిని తీవ్రంగా నిరసించారు. కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడం, షోకాజ్ నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా దుయ్యపట్టారు. అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటకరణ నుంచి కాపాడుకోవడం కార్మికుల జీవన్మరణ సమస్యగా మారిందన్నారు. విశాఖ స్టీల్ కార్మికుల ఉద్యమం ఒంటరి కాదని దీనికి దేశ వ్యాప్తంగా ఉన్న కార్మిక సంఘాలన్నీ మద్దతు ఇస్తున్నాయన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ దేశానికి ఆదాయాన్నిస్తూ లాభాలు అందిస్తుందని అందుకే ఈ ప్లాంట్ ను అంబానీ ఆదానికి కట్టబెట్టాలన్న పాలకుల నిర్ణయానికి వ్యతిరేకంగా కార్మిక పోరాటం సాగుతుందన్నారు. ఈ పోరాటాన్ని అణిచివేయడానికి కార్మికుల జీవనోపాధిని మింగేస్తూ ఆర్థిక ఇబ్బందులను సృష్టించి కార్మికుల మనోధైర్యాన్ని దెబ్బతీసే చర్యలకు ప్రభుత్వ యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయని వారు తీవ్రంగా విమర్శించారు.

విద్యుత్ షాక్ తగిలి విద్యార్థి మృతి

విశాలాంధ్ర-ఆనందపురం : ఆనందపురం మండలం చందక గ్రామం వద్ద కిరాణా షాపులో జరిగిన విద్యుత్ షాక్ ప్రమాదంలో రెడ్డి దశ్వంత్(14) విద్యార్థి మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. దొంతల వారి కల్లాలలో నివాసముంటున్న రెడ్డి శివలక్ష్మి కుమారి దంపతుల కుమారుడు దస్వంత్ చందక గ్రామంలో ఉన్న సత్య ఎంటర్ప్రైజెస్ కిరాణా దుకాణంలో పనిచేస్తున్న మేనమామ సాయి దగ్గరకు మంగళవారం ఉదయం 10 గంటల 30 నిమిషాలు సమయంలో షాపు వద్దకు వెళ్ళాడు. వాటర్ బాటిల్ అవసరం నిమిత్తం షాపులో ఉన్న ఫ్రిడ్జ్ తీసే క్రమంలో అప్పటికే ఫ్రిడ్జ్ విద్యుత్ సర్క్యూట్ అవడంతో షాక్‌కు గురై అక్కడే పడిపోయాడు. గమనించిన మేనమామ సాయి తండ్రి శివకు సమాచారం అందించగా కొమ్మాది దగ్గరలో గల గాయత్రి హాస్పిటల్ లో వైద్య నిమిత్తం తరలించారు. పరిశీలించిన డాక్టర్లు మృతి చెందారని తెలపడంతో తల్లిదండ్రులు, శివ, లక్ష్మి కుమారి, సోదరుడు బోరున విలపించారు. విద్యార్థి ప్రస్తుతం ఆనందపురం హైస్కూల్లో ఆరో తరగతి చదువుతున్నాడు. తండ్రి శివ ఫిర్యాదు మేరకు ఆనందపురం పోలీస్ స్టేషన్లో సర్కిల్ ఇన్స్పెక్టర్ సిహెచ్ .వాసు నాయుడు ఆదేశాలు మేరకు కేసు నమోదు చేసి ఏఎస్ఐ సత్తిబాబు దర్యాప్తు చేస్తున్నారని, బాడీని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, తెలిపారు.

పోస్ట్ ఆఫీసుల్లో పనిచేయని సర్వర్... ఖాతాదారులకు తప్పని ఇక్కట్లు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : ఇంటర్నెట్ బ్యాంకింగ్ విస్తరిస్తున్న నేపధ్యంలో ఇంకా పోస్టల్ శాఖ వెనుకబడే ఉంది. వినియోగదారులకు అధునాతన సేవలు అందించాల్సిన పోస్టల్ బ్యాంక్ లు సాంకేతిక ఇంటర్నెట్, సర్వర్ పేరిట రోజు అనేక బ్రాంచ్లో పనిచేయడం లేదన్న బోర్డులతో దర్శనమిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం పోస్టల్ విభాగాన్ని మరింత పటిష్టం చేయాలన్న మాటలే తప్ప చేతల్లో ఆధునిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి రావడం లేదని వినియోగదారులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు . దాబా గార్డెన్స్, కలెక్టర్ ఆఫీస్ , పిఠాపురం కాలనీ, లైసెన్స్ బై కాలనీ ఇలా ఏ బ్రాంచ్ కి వెళ్లిన వినియోగదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. అనేకమంది సీనియర్ సిటిజనులు, మహిళలు, ఖాతాదారులు పోస్ట్ ఆఫీసుల్లో గంటలు తరబడి పడి గాపులు, కాయాల్సిన పరిస్థితి నెలకొంది . మంగళవారం మహారానిపేట కలెక్టర్ కార్యాలయంలో ఉన్న పోస్ట్ ఆఫీస్ లో సాంకేతిక సమస్య ఏర్పడడంతో అనేకమంది ఖాతాదారులు వెని తిరగాల్సన పరిస్థితి నెలకొంది.

మండలంలో దివ్యాంగ పిల్లల సర్వే

విశాలాంధ్ర-ఆనందపురం : ఈనెల13 నుంచి జూన్ 9వ తేదీ వరకు దివ్యంగ విద్యార్థులను గుర్తించి పాఠశాలలో చేర్పించడం జరుగుతుందని మండల సహిత విద్య ఉపాధ్యాయులు కే.శ్రీనివాసరావు, బి.నాగమణి తెలిపారు. కార్యక్రమానికి పరిశీలను జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, సమగ్ర శిక్షణ అధికారి డాక్టర్ జె చంద్రశేఖర్, సహిత విద్య సమన్వయకర్త బి.గీత, ఆధ్వర్యంలో ఏపీవో అప్పలనాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఏపీసీ దివ్యంగి విద్యార్థులు నూతన విద్యా సంవత్సరంలో పాఠశాలలో చేరి మండల భవిత కేంద్రంలో సమగ్ర శిక్షణ ద్వారా అందిస్తున్న సేవలను తెలిపారు అందులో భాగంగా ఫిజియోథెరపీ స్పీచ్ తెరపి ఎస్కార్ట్ ఎలివేషన్స్ ట్రాన్స్పోర్ట్ ఎలివేషన్స్ గుర్తింపు ద్వారా, అవసరమైన ఉపకరణాలు అందజేస్తామని మానసిక దివ్యాంగులకు చదువుకొనుటకు కిట్స్, అందజేస్తామని సమగ్ర శిక్ష ద్వారా అందించు ఇతర సేవలు సదుపాయాలు ప్రతి ఒక్కరు వినియోగించుకొని దివ్యాంగుల సాధారణ పిల్లలతో సమానంగా అభివృద్ధి చెందడానికి సహకారం అవుతుందని తెలిపారు.

నేడు మధురవాడలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

విశాలాంధ్ర-మధురవాడ : ఈనెల 21, బుధవారం ఉదయం 9.00 నుండి మధ్యాహ్నం 01:00 గంట వరకు 33/11కెవి మధురవాడ సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తుల నిమిత్తం ఆ పరిధిలో విద్యుత్ నిలుపుదల చేయటం జరుగుతుందని విద్యుత్ ఆపరేషన్ జోన్3 ఇ.ఇ. పోలాకి శ్రీనివాసరావు తెలిపారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు : మధురవాడ, శివశక్తినగర్, ఆర్టీసీ కాలనీ, నగరంపాలెం, చంద్రం పాలెం, రేవల్ల పాలెం, దుర్గానగర్, వాంబే కాలనీ, స్వతంత్రనగర్, గణేష్ నగర్, సాయిప్రియ లే అవుట్, వల్లీనగర్, దుర్గానగర్, వుడా కాలనీ, ఎన్జీవో కాలనీ, మొదలైన ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదు,కావున విద్యుత్ వినియోగదారులు గమనించి తమకు సహకరించవలసిందిగా ఆయన తన ప్రకటనలో కోరారు.

ఉక్కులో సమ్మె పాక్షికం

- పర్మనెంట్ ఉద్యోగులు విధులకు హాజరు
- సమ్మెలో పాల్గొన్న 85 శాతం కాంట్రాక్ట్ కార్మికులు
- నేటి నుంచి కాంట్రాక్ట్ కార్మికుల నిరవధిక సమ్మె

విశాలాంధ్ర-గాజువాక : కాంట్రాక్ట్ కార్మికులను విధుల నుంచి తొలగించరాదని, ఉక్కు యాజమాన్య కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయి. ఐతే ఉక్కు పర్మనెంట్ ఉద్యోగులు పూర్తి స్థాయిలో విధులకు హాజరు కాగా కాంట్రాక్ట్ కార్మికులు 85 శాతం మంది సమ్మెలో పాల్గొన్నారు. మంగళవారం జనరల్ షిఫ్ట్ ఉద్యోగులకు ఏ షిఫ్ట్‌లో రావాలని ఉక్కు యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసింది. ఉక్కు ఉద్యోగులు ఒక రోజు సమ్మెలో పాల్గొనకపోవడం గమనార్హం. కాంట్రాక్ట్ కార్మికులు మాత్రం సమ్మెలో పాల్గొన్నారు. ఉక్కు సమ్మె సందర్భంగా పోలీసులు భారీగా మోహరించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ సమ్మెకు ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్య రామ్‌తో పాటు ఉక్కు కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు నమ్మి రమణ, మంత్రి రవి నేతృత్వం వహించారు. ఈసందర్భంగా నేతలు మాట్లాడుతూ కార్మికులపట్ల ఉక్కు యాజమాన్యం కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నదని, హక్కుల కోసం పోరాడుతున్న నేతలకు షోకాజ్ నోటీసులు, సస్పెన్షన్ నోటీసులు జారీ చేస్తున్నారని విమర్శించారు. తక్షణమే ఉక్కు యాజమాన్యం తన విధానాలను మార్చుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

చిట్టివలస రైతుబజార్‌ను ప్రారంభించిన గంటా

విశాలాంధ్ర-తగరపువలస : చిట్టివలసలో రూ. 78 లక్షలతో నిర్మించిన రైతు బజార్ ను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించారు. 32 రైతు స్టాల్స్,. 5 కమర్షియల్ షాపులు ఇందులో ఉన్నాయి. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ తాజా కూరగాయలు రైతుబజార్ లో అందుబాటులో ఉంచాలని రైతులకు, అధికారులకు సూచించారు. రైతుబజార్ లో పార్కింగ్, టాయ్ లెట్ల సౌకర్యాలను

పరిశీలించారు. ఎప్పటి నుంచో కోరుకుంటున్న రైతుబజార్ ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, కూటమి నాయకులు గంటా నూకరాజు, గాడు అప్పలనాయుడు, గొలగాని నరేంద్ర, పిట్టా సురేష్, తమ్మిన సూరిబాబు, పరిమి భువనేశ్వరి, గరే సదానంద, మార్కెటింగ్ శాఖ ఏడీ యాసిన్, ఎమ్మార్వో కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

3వ జోన్ పరిధిలోని వీధివిక్రయదారుల నమోదు తప్పనిసరి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ 3వ జోన్ పరిధిలోని వీధివిక్రయదారులు వారి వివరాలను తప్పనిసరిగా మే 23వ తేదీలోపు నమోదు చేసుకోవాలని జీవీఎంసీ 3వ జోన్ జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ మంగళవారం పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. మూడవ జోన్ పరిధిలోని ప్రస్తుతం ఉన్న వీధివిక్రయదారులు, కొత్త వీధి విక్రయదారులు తప్పనిసరిగా వారి వివరాలను స్థానిక సచివాలయం వార్డ్ వెల్ఫేర్ కార్యదర్శి వద్ద మే 23వ తేదీలోపు నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈసర్వే ద్వారా ప్రభుత్వం అందించే పథకాలు వీధివిక్రయదారులకు అందుబాటులోనికి వస్తాయని సర్వేలో నమోదైనవారికి వెండింగ్ కార్డు, వెండింగ్ సర్టిఫికేట్ ప్రభుత్వం అందిస్తుందని ఇది వీధివిక్రయదారులకు గుర్తింపు పత్రంగా పనిచేస్తుందని తెలిపారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వం అందించే సహాయాన్ని పొందేందుకు ప్రతి ఒక్క వీధి విక్రయదారుడు తమ వివరాలను మే 23వ తేది లోగా వారి పేర్లను నమోదు చేసుకోవాలని జోన్ల కమిషనర్ తెలిపారు.

GREATER VISAKHAPATNAM SMART CITY CORPORATION LIMITED (GVSCCL)

Ref. No: FIN/375/(F&A-GEN)/2025-26; dated 20/05/2025

QUOTATIONS FOR APPOINTMENT OF INTERNAL AUDITOR FOR FY 2025-26

GVSCCL desires to call for quotations from open market for appointment of internal auditor for **FY 2025-26** from Chartered Accountant Firms. Interested may submit sealed quotationwithin 10 days from the date of publication.

For more terms and conditions contact:

E-mail: visakhapatnamsmartcity@gvsccl.in,
Mobile No.9603336622, 8142918833.

Sd/- MD & CEO, GVSCCL

బడుగులకు అండగా టీడీపీ

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాలాంధ్ర-పి.యం.పాలెం : "చంద్రబాబు నాయుడి ప్రోత్సాహంతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన నేను ఆయన ప్రొడక్ట్ అని చెప్పుకోవడానికి గర్వపడతాను" అని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. పాలనా సంస్కరణలు, అభివృద్ధితో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరిచిన చంద్రబాబు విజన్ కు దేశమంతా హారతులు పడుతున్నారని పేర్కొన్నారు. ఢిల్లీ, బెంగళూరు, ముంబయి, చెన్నై ఎక్కడకు వెళ్లినా.. చంద్రబాబు లాంటి విజనరీ లీడర్ ఉండడం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల అదృష్టమని అక్కడి మిత్రులు చెబుతుంటారని అన్నారు. మధురవాడ వి కన్వెన్షన్ లో మంగళవారం జరిగిన భీమిలి నియోజకవర్గం మినీ మహానాడులో ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయాలను ఎంతగానో ఇష్టపడతానని, పేద ప్రజలకు సంక్షేమాన్ని.. మహిళలకు ఆస్తి హక్కు, సమాన అవకాశాలు కల్పించిన యుగపురుషుడని కీర్తించారు. ప్రపంచంలోనే కార్యకర్తలకు సంక్షేమ నిధి ఏర్పాటు చేసిన మొట్టమొదటి రాజకీయ పార్టీ టీడీపీ అన్నారు. యువ నాయకుడు లోకేష్ ఇచ్చిన స్ఫూర్తితో కోటి సభ్యత్వాల మార్కును సాధించడం రాజకీయ చరిత్రలో అరుదైన అంశమని తెలిపారు. లక్ష సభ్యత్వాలతో రాష్ట్రంలో టాప్ 10 లో భీమిలి కూడా ఉండడం వెనుక గంటా రవితేజ కృషి ఎంతో ఉందని ప్రశంసించారు. అత్యధిక మెజారిటీ ఇచ్చిన భీమిలి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. అనంత పద్మనాభస్వామి ఆలయానికి ఘాట్ రోడ్డు నిర్మాణం.. సింహాచలం దేవస్థానం నిర్మాణాల క్రమబద్ధీకరణ.. వంటి దీర్ఘకాలిక అంశాలను పరిష్కరిస్తానని తెలిపారు. అప్పులతో రాష్ట్రాన్ని అప్పజెప్పినప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను ప్రాధాన్య క్రమంలో నెరవేరుస్తూ వస్తున్నామని గంటా చెప్పారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల భర్తీలో న్యాయం చేస్తామన్నారు. ఒక కార్యకర్తకు ఒక పదవి.. వంటి నిబంధనలను అనుసరించి ఎంపిక చేసిన కొత్త కమిటీలను తొందర్లోనే ప్రకటిస్తామని ఆయన వెల్లడించారు. రూ. 2 వేల పెన్షన్ ను రూ. 3 వేలు చేయడానికి వైసీపీ ప్రభుత్వం అయిదేళ్ల సుదీర్ఘ సమయాన్ని తీసుకుందని, కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 3 వేల పెన్షన్ ను రూ. 4 వేలు చేసిందన్న విషయాన్ని గుర్తు పెట్టుకుని మాట్లాడాలని ఆ పార్టీ నాయకులకు సలహా ఇచ్చారు. యువ నాయకుడు గంటా రవితేజ మాట్లాడుతూ టీసీఎస్, గూగుల్, అదానీ వంటి ప్రపంచ ప్రఖ్యాత సాఫ్ట్ వేర్ సంస్థలను భీమిలి నియోజకవర్గానికి తీసుకు వస్తున్న ఐటీ శాఖ మంత్రి లోకేష్ ఆ సంస్థల ఉద్యోగాల్లో స్థానిక యువతకు ప్రాధాన్యమిచ్చేలా చూడాలని కోరారు. యువత భవిష్యత్ కోసం నిరంతరం ఆలోచించే లోకేష్ నాయకత్వంలో పని చేయడం అదృష్టమన్నారు. పార్టీ పరిశీలకుడైన డీసీఎంఎస్ చైర్మన్ కోట్నీ బాలాజీ మాట్లాడుతూ తెలుగుదేశానికి భీమిలి కంచుకోటని, లక్షకు పైగా సభ్యత్వాలు నమోదు చేయడమనేది సామాన్యమైన విషయం కాదన్నారు. 6 వ వార్డు అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, కార్పొరేటర్లు గాడు చిన్ని కుమారి లక్ష్మి, పి.వి.నరసింహం, మొల్లి హేమలత, పిల్లా మంగమ్మ, గంటా అప్పలకొండ, లొడగల అప్పారావు, జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, డి.ఎ.ఎన్.రాజు, కోరాడ రమణ, బి.ఆర్.బి. నాయుడు, జీవన్ కుమార్, గాడు అప్పలనాయుడు, మొల్లి లక్ష్మణరావు, పిల్లా వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మెట్ల మార్గంలో 22వ తేదీ వరకు హనుమాన్ జయంతి ఉత్సవాలు



విశాలంధ్ర-సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీ నృసింహ స్వామివారి మెట్ల మార్గంలో ఉన్న హనుమంతుని ఆలయంలో 22 వ తేది వరకు హనుమాన్ జయంతి ఉత్సవాలు జరగనున్నాయి. క్షేత్ర పాలకుడు అయినటువంటి హనుమంతుని వైశాఖ బహుళ అష్టమి అంటే మంగళవారం నుండి వైశాఖ బహుళ దశమి వరకు అంటే 22వ తేదీ నాడు విశేష ఉత్సవాలు ముగియ నున్నట్లు ప్రధాన అర్చక స్వాములు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇంచార్జ్ కార్యనిర్వాహణాధికారి ఎస్.సుజాత తెలిపారు. మంగళవారం ఉదయం గం.8.00 లకు గణపతి పూజ, పుణ్యాహవచనం, శ్రీ సుందరకాండ పారాయణం ప్రారంభం . 21 వ తేది బుధవారం ఉదయం గం.. 7.00 లకు శ్రీ స్వామి వారి అభిషేకం, సహస్రనామార్చన సుందరకాండ పారాయణం కొనసాగింపు, నివేదనలు. 22వ తేది గురువారం ఉదయం గం. 6.30 ని..లకు పంచామృతాభిషేకం ఉదయం గం.. 7.00 లకు విశేష సహస్రనామార్చన. ఉదయం గం..9.00 లకు శ్రీరామ పట్టాభిషేక సర్గ ఉదయం గం..9.30 లకు పూర్ణాహుతి అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరుగనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ట్రాన్స్ఫర్మేటివ్ క్లైమేట్ యాక్షన్ ప్లాన్ ఆవశ్యకతపై నగర మేయర్ సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : నగరంలో విపత్తులు సంభవించినప్పుడు ప్రాణ, ఆస్తి నష్ట నివారణకు ఎలా చర్యలు చేపట్టాలనే అంశంపై యునైటెడ్ నేషన్స్ యూనివర్సిటీ, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ ఎఫైర్స్ మరియు ది ఎనర్జీ అండ్ రిసోర్స్ ఇనిస్ట్యూట్ ప్రతినిధులు నగర మేయర్ పీలా శ్రీనివాసరావుకు వివరించారు. మంగళవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో UNU, NIUA, TERI ప్రతినిధులు మేయర్ ను కలసి ట్రాన్స్ఫర్మేటివ్ క్లైమేట్ యాక్షన్ ప్లాన్ ఆవశ్యకతపై విషయాలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ ట్రాన్స్ఫర్మేటివ్ క్లైమేట్ యాక్షన్ ప్లాన్ వలన విశాఖ నగరానికి ప్రజలకు కలిగే ప్రయోజనంపై బృందం సభ్యులతో చర్చించామని, ఈ ప్రాజెక్టు ద్వారా అర్బన్ లివింగ్ ల్యాబ్ ఫ్లాట్ ఫార్మ్ ను ఆవిష్కరించి తద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలను అలాగే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం వాతావరణంలో వచ్చిన మార్పులు వలన కలిగిన విపత్తులు, వడగాలులు, వరదలు మొదలైనవి సంభవించినప్పుడు ప్రజల సహకారంతో నష్ట నివారణ ఎలా తగ్గించుకోవచ్చును అనే అంశంపై వివరంగా బృందం సభ్యులు వివరించారని తెలిపారు. దీనిపై పూర్తిగా చర్చించి ఏ విధంగా తదుపరి ప్రణాళికలు చేపట్టాలో మేయర్ వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో క్లైమేట్ సెల్ ఎస్ అర్ యు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరించిన కింగ్‌ఫిషర్ బీర్

విశాలాంధ్ర-విశాఖపట్నం : తయారీదారులు, వినియోగదారుల నుంచి పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి, కింగ్‌ఫిషర్ బీర్ యొక్క నిరంతర లభ్యతను నిర్ధారించడానికి హీనెకెన్ కంపెనీలో భాగమైన యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్ (యుబిఎల్) ఆంధ్రప్రదేశ్‌లో తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరించింది. కంపెనీ కార్యకలాపాల విస్తరణపై యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ జోర్న్ కెర్స్టన్ మాట్లాడుతూ మారుతున్న వినియోగదారుల ప్రాధాన్యతలు, తక్కువ ఆల్కహాల్ పానీయాలకు అనుకూలంగా ఉండే నియంత్రణ మార్పులకు అనుగుణంగా ఈ విస్తరణ రాష్ట్రంలో యుబిఎల్ ఉనికిని మరింతగా విస్తరింప చేస్తుందన్నారు. పీక్ సీజన్లలో పెరిగే డిమాండ్‌ను తీర్చడానికి కంపెనీని సిద్ధంగా ఉంచుతుందన్నారు. యుబిఎల్ ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లాలోని రణస్థలంలో సొంత యాజమాన్యంలోని బ్రూవరీని నిర్వహిస్తోందని, దాని ప్రాంతీయ కార్యకలాపాలను మరింత విస్తరించటానికి సరఫరా చైన్ చురుకుదనాన్ని పెంపొందించడానికి కంపెనీ ఇలియోస్ బ్రూవరీస్ ప్రైవేట్ లిమిటెడ్ నుండి అదనపు సౌకర్యం ను లీజుకు తీసుకొందని చెప్పారు. ఈ విస్తరించిన సామర్థ్యం దీర్ఘకాలిక వృద్ధికి తోడ్పడుతుందని, ఆంధ్రప్రదేశ్ అంతటా పంపిణీ సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మా కార్యకలాపాలను విస్తరించడానికి తాము ఆసక్తిగా ఉన్నామని, మా వినియోగదారులకు వారికి ఇష్టమైన బీర్‌ను మరింత మెరుగ్గా అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. ఆంధ్రాలో మా ఉత్పత్తి విస్తరణ కింగ్‌ఫిషర్‌ను ఇష్టపడేవారిపట్ల మా బీర్ల పోర్ట్‌ఫోలియో పట్ల మా నిబద్ధతను ప్రతిబింబిస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సులభంగా లభించేలా అధిక-నాణ్యత కలిగిన, స్థానికంగా తయారుచేసిన బీరును అందించడానికి మేము అంకితభావంతో కృషి చేస్తున్నామన్నారు. ఈ కొత్త సౌకర్యం రాష్ట్రంలో తమ దీర్ఘకాలిక వృద్ధి ఆశయాలను పెంపొందించడంతో పాటు వినియోగాన్ని ప్రోత్సహించే ప్రాధాన్యత ఎంపికగా బీర్‌ను ఉంచడం ద్వారా బీర్ విభాగాన్ని రూపొందించడంలో యుబిఎల్ యొక్క విస్తృత వ్యూహానికి అనుగుణంగా ఉంటుందని చెప్పారు.